ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 30 నవంబరు 2025



ఎఫ్ఎస్‌వోగా లావణ్య

శ్రీకాకుళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి(ఎస్ఎస్‌వో)గా ఎం.లావణ్య నియమితులయ్యారు. శనివారం రాష్ట్రంలో పలువురు డెప్యూటీ కలెక్టర్లను బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఇందులో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్ లావణ్యను శ్రీకాకుళం ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ముఖ్య సెక్రటరీ కె.విజయానంద్ ఉత్తర్వులను జారీచేశారు.

మొరాయిస్తున్న సర్వర్

- ధాన్యం విక్రయించేందుకు అవస్థలు
- కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు
- సరిపడా జీపీఎస్ వాహనాలు లేక ఇక్కట్లు
- ట్రక్‌షీటు కోసం రైతుల అగచాట్లు



సర్వర్ మొరాయించడంతో కరగాం ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిరీక్షిస్తున్న రైతులు

నరసన్నపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సాంకేతిక లోపం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి యాప్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో రెండు రోజుల నుంచి ధాన్యం విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు తుఫాన్ హెచ్చరికలతో కళ్లాల్లో ధాన్యం తడిసి పోతాయోమోనని ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలలోని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. సుమారు 60 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం 406 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో సాంకేతిక సిబ్బంది, డేటా ఆపరేటర్లను ఒప్పంద ప్రాతిపాదికన నియమించింది. సివిల్‌సప్లయ్ శాఖకు చెందిన ప్రత్యేక యాప్ ద్వారా ధాన్యం కొనుగోలు పక్రియ చేపడుతోంది. రైతులు ధాన్యంను విక్రయించేందుకు ఈ-క్రాప్ నమోదు ఆధారంగా షెడ్యూల్ తీసుకోవాలి. తర్వాత సాంకేతిక సిబ్బంది కళ్లాలకు వచ్చి ధాన్యం దిగుబడి, తేమ శాతం పరిశీలిస్తారు. నిబంధనలు మేరకు ఉంటే డేటా ఆపరేటర్ వద్దకు రైతు వెళ్లి తనకు ఇష్టం వచ్చిన మిల్లుకు ధాన్యం ఇచ్చేందుకు ట్రక్కు షీటు తీసుకోవాలి. ఈ సమయంలో జీపీఎస్ కలిగి ఉన్న వాహనం నెంబరు మాత్రమే నమోదు చేయాలి. తరువాత రైతులు కోరుకున్న మిల్లుకు ఎన్ని ధాన్యం ఇస్తున్నారో.. వివరాలతో నెంబరుతో ట్రక్కు షీటు జనరేట్ అవుతుంది. అప్పుడు రైతు.. ఆ ధాన్యాన్ని ట్రక్కు షీటులో నమోదు చేసిన జీపీఎస్ అనుసంధానమైన వాహనంతో మాత్రమే మిల్లుకు పంపించి కస్టోడియన్ అధికారికి అప్పగించాలి. కస్టోడియన్ అధికారి (మిగతా 6వ పేజీలో..)



ట్రక్కు షీటు జనరేట్ కాక కంబకాయి వద్ద రోడ్డు మీద ఆరబెట్టిన ధాన్యం

పత్తి రైతు చిత్తు!

- జిల్లాలో కొనుగోలు కేంద్రాలు లేక ఇక్కట్లు
- గత రెండు నెలలుగా ఇంటి వద్దే పంట
- రవాణా భారం మోయలేక దళారులకు విక్రయాలు



రణస్థలంలో ఓ ఇంటి వద్ద ఆరబెట్టిన పత్తి

రణస్థలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది పత్తి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో భాగంగా పత్తి సాగుచేయగా.. తొలి దశలో వర్షాలు కురవక నష్టం కలిగింది. పంట చేతికందే సమయానికి తుఫాను ప్రభావంతో పంట దెబ్బతింది. ఉన్న కొద్దిపాటి పంటను రైతులు కాపాడుకున్నారు. కానీ మద్దతు ధర లభించక.. అమ్ముకునే మార్గం లేక రైతులు లబోదిబోమంటున్నారు. గత రెండునెలలుగా ఇంట్లోనే నిల్వ ఉంచారు.

జిల్లాలోని జి.సిగడాం, లావేరు, రణస్థలం, కొత్తూరు, సరుబుజ్జిలి, పొందూరు తదితర మండలాల్లో ఎక్కువగా పత్తి సాగవుతోంది. ఈ ఏడాది సుమారు 1970 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. వర్షాభావం, వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో పత్తిని సాగుచేస్తే 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ ఈ ఏడాది 3 నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. అయితే అమ్మకాలు చేయడానికి జిల్లాలో కొనుగోలు కేంద్రం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పత్తి విక్రయించాలంటే విజయనగరం జిల్లా రాజాం, పార్వతీపురం మన్యం జిల్లా రామభద్రపురంలో కొనుగోలు కేంద్రాలకు తరలించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరూ చిన్న, సన్నకారు రైతులే. దీంతో రవాణా ఖర్చులు అదనపు భారంగా మారుతాయి. అయితే ఇదే అదునుగా దళారులు (మిగతా 6వ పేజీలో..)

సర్కిల్ ఆఫీసు నుంచి దొంగ పరారీ!

- మూడు రోజులు కిందట ఘటన
- ఆలస్యంగా బయటపడిన వైనం
- స్టేషన్ బెయిల్ ఇచ్చామంటున్న సీఐ

నరసన్నపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని సర్కిల్ ఆఫీసు నుంచి ఓ దొంగ పరారీ అయినట్టు తెలుస్తోంది. మూడు రోజుల కిందట ఈ ఘటన జరగ్గా.. ఆలస్యంగా బయటపడింది. బుడితి గ్రామానికి చెందిన జె.అప్పలనాయుడు.. నరసన్నపేట పాతబస్టాండ్‌లోని ఓ సిమెంట్ షాపులోకి ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లాడు. అక్కడ కౌంటర్‌లో ఉన్న రూ.85వేల వరకు నగదు చోరీ చేశాడు. ఈ విషయాన్ని గమనించి ఒక వ్యక్తి కేకలు వేయగా పారిపోయేందుకు యత్నించాడు. స్థానికులు అతడ్ని పట్టుకుని నరసన్నపేట పోలీసులకు అప్పగించారు. అప్పలనాయుడు గతంలో ఇదే సిమెంట్ షాపులో నాలుగు సార్లు చోరీకి పాల్పడి సుమారు రూ.5 లక్షల వరకు ఎత్తుకెళ్లినట్లు తేలింది. దీంతో షాపు యాజమాని అదేరోజు నరసన్నపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టేందుకు పోలీసులు నిందితుడ్ని పిలిచారు. పలు కేసులపై విచారణ, శాస్త్రీయపరమైన ఆధారాల కోసం సర్కిల్ కార్యాలయంలోని గదిలో ఉంచారు. అప్పలనాయుడు మూడు రోజుల కిందట తెల్లవారుజామున బాత్‌రూమ్‌కు వెళ్లినట్లు నటించి.. కార్యాలయం బయట ఉన్న హోంగార్డు దిచక్రవాహనం చోరీ చేసి పారిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు మూడు రోజులుగా నిందితుడు కోసం నరసన్నపేట సర్కిల్ సిబ్బంది గాలిస్తున్నారు. పోలీసుల కళ్లుకప్పి నేరస్థుడు పరారీ కావడం నరసన్నపేటలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై సీఐ ఎం.శ్రీనివాసరావు వద్ద ప్రస్తవించగా విచారణ చేపట్టడం వాస్తవమేనని.. నిందుతుడికి 41ఏ స్టేషన్‌బెయిల్ ఇచ్చి పంపించామని తెలిపారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

- 65 హాట్‌స్పాట్లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- అభ్యుదయ సైకిల్ యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొనాలి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా నార్కోటిక్స్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'గంజాయిని సమూలంగా అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా గుర్తించిన 65 హాట్‌స్పాట్‌ల వద్ద సీసీ కెమెరాలను స్థానిక సంస్థలు ఏర్పాటు చేయాలి. శ్రీకాకుళంలోని పాతవంతెన వద్ద, రివర్ బెడ్, దమ్మల వీధి, వాటర్ ట్యాంకు, ఏపీహెచ్‌బీ కోలనీ పార్కు వెనుక భాగం, ఆర్టీసీ కాంప్లెక్స్ పాత భవనాల వెనుక భాగం వంటి ప్రదేశాల్లో తప్పనిసరిగా పూర్తి నిఘా ఉంచాలి. ఇప్పటివరకు 32 ప్రాంతాల నుంచి సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రాగా, కేవలం 3 కెమెరాలు మాత్రమే ఏర్పాటు చేశారు. రానున్న రెండు రోజుల్లో మిగిలిన వాటికి ప్రతిపాదనలు పంపి, సత్వరం పూర్తిచేయాల'ని ఆదేశించారు.

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం. మాదకద్రవ్యాల సమాచారం తెలిసిన వెంటనే 112 ద్వారా, లేదా ప్రత్యేక హెల్ప్‌లైన్ల ద్వారా పోలీసులకు సమాచారం అందజేయాలి. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో దీపాలను ఏర్పాటు చేయాల'ని మునిసిపల్ కమిషనర్లు, డీపీఓలను కోరారు. అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను పటిష్ఠంగా నిర్వహించాల న్నారు. 'జిల్లాలో 38 ప్రభుత్వ, 67ప్రైవేటు జూనియర్ కళాశాలతోసహా అన్ని కళాశాలల్లో గంజాయి నివారణ కోసం ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలి. మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన కల్పించాలి. గంజాయి నిర్మూలనపై హోంమంత్రి ప్రారంభించిన "అభ్యుదయం" సైకిల్ యాత్రలో జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాల'ని ఎస్పీ కోరారు.

రహదారుల భద్రతపై జరిగిన సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ 'శ్రీకాకుళం నవభారత్ జంక్షన్ వద్ద పాదచారుల భద్రత కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ప్రైవేటు బస్సులు ఆపకుండా కేసులు నమోదు చేయాలి. రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేసినా కఠినచర్యలు తీసుకోవాల'ని ఆదేశించారు. సమావేశంలో పోలీసు, విద్య, వైద్యారోగ్యశాఖ, ఇంజనీరింగ్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ మహేశ్వరరెడ్డి



చాపురంలో సీసీ రోడ్డు ప్రారంభానికి రిబ్బన్ కట్ చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి/ పాత శ్రీకాకుళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన శ్రీకాకుళం మండలంలోని చాపురం, పాత్రునివలసతో పాటు పీఎస్ఎన్ఎం పాఠశాల ఎదురుగా కోలనీలో పలు రోడ్లు, కాలువల నిర్మాణానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. డీసీసీబీ కోలనీలో రూ.15లక్షలతో నిర్మించిన దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు పార్కును ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 'శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో రూ.28.17 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, చాపురంలో రూ.16లక్షల నిధులతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం చేపట్టాం. ఇందిరానగర్ కాలనీలో రోడ్డును ప్రారంభించామ'ని తెలిపారు. మిర్తిబట్టిని పరిశీలించి, మురుగునీరు సక్రమంగా ప్రవహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, ఇంజినీర్లు, సీనియర్ టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండాగా పని చేయండి

- జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- డిసెంబరు నుంచే ఉపాధి పనులు ప్రారంభం కావాలి: ఎమ్మెల్యే కూన రవి

జాతీయ రహదారిపై కంటైనర్ దగ్ధం

- డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలు

6లో



శ్రీకూర్మనాథుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథుడ్ని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను అర్చకులు వివరించారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ ఇన్‌చార్జి బి.నాగభూషణం, మండల తెలుగు యువత నాయకుడు అరవల పెద్దబాబు పాల్గొన్నారు.

- గార, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):

అందని పశువైద్యం!

- పశుసంవర్ధక శాఖలో వైద్యుల కొరత
- ఆర్ఎస్‌కేల్లో మందులు అంతంతే
- పాడి రైతులకు తప్పని ఇబ్బందులు

ఇచ్ఛాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువైద్యం సక్రమంగా అందడం లేదు. పశుసంవర్ధకశాఖలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేరు. చాలాచోట్ల పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రైతుసేవా కేంద్రాల్లో పశు వైద్యానికి అవసరమైన మందులు అందుబాటులో లేవు. దీంతో పశువులకు వైద్యసేవలు అందడం లేదు. పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పశు సంచార వైద్యసేవలు కూడా అంతంతమాత్రంగా అందుతున్నాయి. మారుమూల గ్రామాలకు సేవలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.



డొంకూరులో మూతపడిన పశు వైద్యశాల

- ఇదీ పరిస్థితి..

జిల్లాలో 61 గ్రామీణ లైవ్‌స్టాక్ కేంద్రాలు, 77 వెటర్నరీ డిస్పెన్సరీలు, 15 వెటర్నరీ ఆస్పత్రులు, ప్రయోగశాలలతో పాటు పాలీ క్లినిక్‌లు ఉన్నాయి. అయితే గ్రామీణ పశు వైద్యశాలలు చాలాచోట్ల మూతపడ్డాయి. ఇచ్ఛాపురం మండలం డొంకూరులో 2018లో గ్రామీణ పశువైద్యశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఒక వైద్యుడ్ని కూడా నియమించారు. రోజూ ఆ ఆస్పత్రి పరిధిలో వైద్యుడు సేవలందించేవారు. కానీ గత రెండేళ్లుగా ఇక్కడ వైద్యుడు లేకపోవడంతో పూర్తిగా పశువైద్యశాల మూతపడింది. చుట్టూ పిచ్చిమొక్కలు, (మిగతా 6వ పేజీలో..)

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.కె.అనిత

అరసవల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ముగ్గుల పోటీలను డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత ప్రారంభించారు. అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని తెలిపారు. 'జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. సురక్షిత శృంగారం కోసం నిరోధ్‌లు వినియోగించాలి. పిల్లల్లో వ్యాధి వ్యాప్తి చెందకుండా నెవిరాపిన్ చుక్కల మందు వేసుకోవాల'ని డీఎంహెచ్‌వో సూచించారు. ముగ్గుల పోటీల్లో 47మంది పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డా.తాడేల శ్రీకాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.మేరీక్యాథరీన్, డా.శైలజ, మోహిని, సిబ్బంది, పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత

థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనను రద్దు చేయాలి

- అడ్డూరిపేటలో పోరాట కమిటీ నాయకుల నిరసన

7లో

క్లోరినేషన్‌కు నోచుకోని ట్యాంకులు

- శిథిలావస్థలో మెట్లు
- మామిడిపల్లి, సరియాపల్లి గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం

8లో

లక్ష్యం.. శతశాతం

- పది పరీక్షల కోసం కార్యాచరణ
- కార్పొరేట్‌కు దీటుగా ఫలితాల సాధనకు కృషి
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు

విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో శతశాతం లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా విద్యాశాఖ ముందుకెళుతోంది. దీని కోసం ప్రణాళికను అమలు చేస్తోంది. ప్రత్యేక తరగతులతో లక్ష్యాన్ని సాధించాలని యోచిస్తోంది.



నరసన్నపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వంద రోజుల ప్రణాళికను అధికారులు అమలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే పనిలో ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లా పరిధిలో 450 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల నుంచి 21,377 మంది వరకూ పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. గత ఏడాది ఫలితాల్లో జిల్లా మొదటి ఐదు స్థానాల్లో ఉంది. ఈ క్రమంలో ఈ ఏడాది అత్యున్నత ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిత్యం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు... సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. ఉదయం వేళల్లో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు సాయంత్రం సమయంలో అసైన్‌మెంట్లు ఇస్తున్నారు. గతంలో జరిగిన ఎస్ఏ 1, 2 పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను పరిశీలించి... ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తిస్తున్నారు. ఆ పాఠ్యాంశాల్లో వారికి స్టడీ అవర్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులకు ఇప్పటికే టైంటేబుల్ కేటాయించారు. ఆ సబ్జెక్టుల్లో శిక్షణతో పాటు ప్రత్యేక తరగతుల్లో సామర్థ్యాలను అంచనా వేస్తున్నారు. గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నపత్రాలను సేకరించి అందులో ముఖ్యమైన ప్రశ్నలు గుర్తించి విద్యార్థులకు ఉపాధ్యాయులు అందజేశారు. విద్యార్థులను ఎ,బి,సి,డి గ్రేడ్లుగా విభజించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో ఎ,బి గ్రూపుల్లోని విద్యార్థులకు రోజు వారీ ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. సి, డి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు స్టడీ అవర్స్‌తో పాటు వెనుకబడి ఉన్న సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

నిత్యం పర్యవేక్షణ..

పరీక్షలు హాజరయ్యే విద్యార్థుల స్టడీ అవర్స్ తీరును విద్యాశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. డీఈవో, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు ఇందుకోసం ప్రత్యేక షెడ్యూల్‌ను నిర్దేశించుకొని... పాఠశాలలను సందర్శిస్తున్నారు. విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు? ఇప్పటి వరకు సబ్జెక్టుల వారీగా వచ్చినమార్కులు ఎన్ని అనే వివరాలు పరిశీలించి.. నివేదికలు తయారు చేస్తున్నారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు డిసెంబరు నుంచి అల్పాహారం పంపిణీకి ఏర్పాటు చేస్తున్నారు.

పక్కాగా ప్రత్యేక తరగతులు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలు పూర్తయిన వెంటనే వెనుకబడిన విద్యార్థులను గుర్తించి... వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తాం. డిసెంబరు ఒకటో తేదీ నుంచి ప్రత్యేక తరగతులు ఉన్న విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ప్రభుత్వం సంకల్పించింది.

-రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎక్కువ కేసుల పరిష్కారంపై దృష్టి

- లోక్ అదాలత్‌కు సిద్ధమవ్వండి
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో లోక్‌అదాలత్ కేసులతో పాటు బెయిళ్లు, రానున్న ఎన్నికల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 13న జిల్లాలోని న్యాయస్థానాల్లో నిర్వహించే లోక్ అదాలత్‌లో కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్, ట్రాఫిక్, కాంపౌండ్ వంటి రాజీకి సాధ్యమైన కేసులను ముందుగానే గుర్తించాలని సూచించారు. ఇరువర్గాలతో సంప్రదించి.. స్వీయ ఒప్పందంతో రాజీకి ప్రోత్సహించాలన్నారు. ప్రతి స్టేషన్‌లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కేసుల రాజీలో పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం శాతం పెరగడం వల్ల ప్రజలకు వేగవంతంగా న్యాయం అందు తుందన్నారు.

సున్నిత గ్రామాలపై నిఘా...

రానున్న ఎన్నికల దృష్ట్యా సున్నితమైన, అత్యంత సున్నితమైన గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి ముందస్తు చర్యలను పర్యవేక్షించేందుకు జిల్లాలోని గ్రామాల సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి గ్రామానికి సంబంధించిన జనాభా వివరాలు, కమ్యూనిటీ ప్రదేశాలు, ముఖ్యమైన ప్రాంతాలు, ఇదివరకు గొడవలు జరిగిన ప్రాంతాలపై సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలన్నారు. ముఖ్యమైన కేసుల్లో బెయిల్ విచారణ సమయంలో సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బెయిల్ షరతులు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు సి.హెచ్.వివేకానంద, డి.లక్ష్మణరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్‌గేమ్స్ మేనేజర్లుగా మన పీఈటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ అండర్-14 బాలురు, బాలికలకు కోచ్ కమ్ మేనేజర్లుగా జిల్లా నుంచి నలుగురు వ్యాయామ ఉపాధ్యాయులను నియమిస్తూ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ నుంచి ఉత్తర్వులు అందాయి. డిసెంబరు 1 నుంచి 4వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనున్న ఈ పోటీలలో మేనేజర్లుగా వీరు వ్యవహరిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ హెచ్ఎస్ పీఈటీ బాడాన నారాయణరావు, సంతబొమ్మాళి మండలం యామలపేట జెడ్పీ హెచ్ఎస్ పీఈటీ నడిమింటి నాగరాజు, పలాస మండలం బ్రాహ్మణతర్లలో పనిచేస్తున్న పీరుకట్ల సునీత, ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో పనిచేస్తున్న సయ్యద్ సాజన్‌లు ఈ పోటీల్లో పాల్గొంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు అవకాశం వచ్చిన నలుగురు పీఈటీలకు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పి.తవిటయ్య, కార్యదర్శి ఎం.వి.రమణ, సలహాదారు పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బివి.రమణ, ఆర్.స్వాతి, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, గ్రిగ్స్ కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఎ.పి. అథ్లెటిక్స్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ ఛైర్మన్ కె.హరిబాబు తదితరులు అభినందించారు.

అలరించిన సుచిత్ర గాత్ర కచేరీ



కచేరీ చేస్తున్న సుచిత్ర బాలసుబ్రహ్మణ్యం

అరసవల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఆరామ ద్రావిడ సంఘం, శ్రీసుమిత్ర కళా సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇప్పిలి జోగారావు జయంతి ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు చెన్నైకి చెందిన సుప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు సుచిత్ర బాలసుబ్రహ్మణ్యం గాత్రకచేరీ ఆహూతులను ఎంతగానో అలరించింది. ఆమె ఆలపించిన శాస్త్రీయ సంగీత కీర్తనలు రసజ్ఞులను ఆనందంలో ఓలలాడించాయి. మావుడూరు సత్యనారాయణశర్మ (వయోలిన్), మావుడూరు సూర్యప్రసాద్‌శర్మ (మృదంగం), బంకుపల్లి శ్రీనివాస శర్మ (ఘటం) వాయిద్య సహకారం అందించారు. జిల్లాకు చెందిన ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు పెంకి నాగేశ్వరరావు, గాయని కరియామిని, రంప జగదీష్ శర్మను ఎమ్మెల్యే గొండు శంకర్ ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో ఇప్పిలి శంకరశర్మ, పొగిరి సుగుణాకరరావు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, నిక్కు అప్పన్న, మండవిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



గారలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రామ్మోహన్‌నాయుడు

డైట్ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

గార, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వమరవెల్లి ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం మ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి వమరవెల్లి డైట్‌లో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ఆయన ప్రారంభించారు. అక్కడే నూతనంగా నిర్మించనున్న అదనపు భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ డైట్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు. దీని అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు తరగతి గదులు, వసతి సౌకర్యం పూర్తి స్థాయిలో సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గారలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభించారు. వమరవెల్లి గురుకుల పాఠశాల బాలికలు నిర్వహించిన గిరిజన సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఆ తరువాత గారలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించి.. పూజలు చేశారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



బీపీ పరీక్ష చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

శ్రీకాకుళం లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిత్యం పనుల ఒత్తిడిని ఎదుర్కొంటున్న న్యాయవాదులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరాన్ని న్యాయవాదుల కుటుంబాలు, కోర్టు సిబ్బంది ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్ఎం ఫణికుమార్, ఏడో అదనపు జిల్లా న్యాయాధికారి తిరుమలరావు, సీనియర్, జూనియర్ సివిల్ న్యాయాధికారులు ఎం.శ్రీధర్, శాంతిశ్రీ, కె.అనురాగ్, జమృతబేగం, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు ఎన్ని సూర్యారావు, కృష్ణచంద్, ఆగూరు ఉమామహేశ్వరరావు, శీరశంకరరావు, పి.నాగేశ్వరరావు, జల్లు తిరపతిరావు, మామిడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అందని పశువైద్యం!

(ఐదో పేజీ తరువాయి)

చెత్త పేరుకుపోయింది. మరోవైపు పశుసంవర్ధక శాఖలో వైద్యుల కొరత వెంటాడుతోంది. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు 85 మందికిగాను 65 మంది మాత్రమే ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్లు 55 మంది ఉండాల్సి ఉండగా 26 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పాడి పశువులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. ఒక్కోసారి 20 కిలోమీటర్ల దూరం పశువులు తరలిస్తే కానీ వైద్యం అందని పరిస్థితి.

● సీజనల్ వ్యాధులతో విలవిల..

ప్రస్తుతం పశువులకు సీజనల్ వ్యాధులు సంక్రమిస్తున్నాయి. రైతుసేవా కేంద్రాల్లో మందులు అందుబాటులో లేవు. జిల్లాలో ఆవులు 4,56,000, గేదెలు 46,000, గొర్రెలు, మేకలు 9 లక్షలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. గతంలో మండల, గ్రామీణ పశు వైద్యులు, గోపాలమిత్రల ద్వారా మెరుగైన సేవలు అందేవి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పశువైద్యాన్ని అస్తవ్యస్తం చేసింది. రైతుసేవా కేంద్రాల ద్వారా పశువైద్యం అందిస్తామని చెప్పింది. కానీ అక్కడ పశువైద్యులను, సహాయకులను నియమించలేదు. మందులు సైతం అరకొరగా అందుబాటులో ఉంచడంతో పశువైద్యం దైన్యంగా మారింది. ప్రస్తుతం ఎక్కువగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాలు, అరుగువాపు, పొదుగు, అలర్జీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పశువైద్యం సక్రమంగా అందించేలా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

● పటిష్ఠ చర్యలు..

పశుసంవర్ధక శాఖలో వైద్యులతోపాటు సిబ్బంది కొరత వాస్తవమే. అయినా సరే ఉన్నవారితో మెరుగైన సేవలందిస్తున్నాం. రైతుసేవా కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. అక్కడ మందులు దొరక్కపోతే మండల పశువైద్య కేంద్రాలను సంప్రదించాలి. సీజనల్ వ్యాధుల దృష్ట్యా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం.

-అప్పలస్వామి, ఏడీ, పశుసంవర్థక శాఖ

మొరాయిస్తున్న సర్వర్

(ఐదో పేజీ తరువాయి)

మిల్లు వద్ద ధాన్యం నాణ్యత పరిశీలించి.. మిల్లరుకు అప్పగిస్తారు. మిల్లరు ధాన్యం చేరినట్లు తన లాగిన్‌లో నమోదు చేస్తారు. అప్పుడు ప్రభుత్వం రైతు ఖాతాలో ధాన్యం సొమ్మును జమ చేస్తుంది. కాగా ఈ విధానంలో పలు సమస్యలు కారణంగా రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

సమస్యలివీ..

● కొందరు రైతులు పంట పండించే సమయంలో ఈ-కైవైసీ చేయించుకోలేదు. రైతులకు షెడ్యూల్ ఇచ్చే వ్యవసాయశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో రైతు సేవాకేంద్రాల్లో ఉండడం లేదు.

● జీపీఎస్ వాహనాలు రైతులకు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు పండించే ధాన్యం మిల్లులకు తరలించేందుకు చిన్నవాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయలేదు. ఒక్కసారి ట్రక్కుషీటు జనరేటర్ అయిన తరువాత ఆ వాహనం అన్‌లోడింగ్ చేసిన తరువాత మాత్రం వెబ్‌సైట్‌లో కనిపించడంతో జాప్యం జరుగుతోంది.

● శాంపిల్స్ తీసుకోవడంలో సాంకేతిక సిబ్బంది జాప్యం చేస్తున్నారు. మిల్లుకు చేరిన తరువాత మిల్లర్లు అదనంగా రెండు, మూడు కేజీల ధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేయడం వంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి.

● రెండు రోజులుగా ధాన్యం కొనుగోలుకు వినియోగించే యాప్ మొరాయించింది. ట్రక్కు షీటు జనరేట్ చేసుకునేందుకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. దీంతో కళ్లాల్లో ధాన్యం బస్తాలు పేరుకుపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు పక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలి..

రెండు రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రం చుట్టూ తిరుగుతున్నాం. షెడ్యూల్ తీసుకున్న వారం రోజుల్లో ధాన్యం పంపించకుంటే షెడ్యూల్ రద్దవుతుంది. రీ షెడ్యూల్ చేసుకోవాలి. ట్రక్కు షీటు జనరేట్ చేయించుకునేందుకు గ్రామాల్లో జీపీఎస్ కలిగిన సరిపడే వాహనాలు లేవు. రైతులు ఇబ్బందులను గుర్తించి కొనుగోలు వేగవంతం చేయాలి.

-పోగోటి వెంకటరావు, కరగాం

సాంకేతిక సమస్య ఏర్పడింది..

రెండు రోజులగా సర్వర్ డౌన్ అవ్వడం వాస్తవమే. రాష్ట్రవ్యాప్తంగా శనివారం సాంకేతిక సమస్యతో సర్వర్ యాప్ పనిచేయలేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేందుకు కొన్ని మార్పులు.. స్పీడు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోనుంది. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం.

-వేణుగోపాలరావు, డీఎం, సివిల్ సప్లయిస్

జాతీయ రహదారిపై కంటైనర్ దగ్ధం



కాలిపోతున్న కంటైనర్

ఇచ్ఛాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురానికి సమీపంలో... ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కొణిసి జాతీయ రహదిరి-16పై శనివారం సాయంత్రం ఓ కంటైనర్ దగ్ధమైంది. ఆంధ్రా నుంచి ఒడిశా వెళుతున్న కంటైనర్‌లో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. దీంతో కంటైనర్ పూర్తిగా కాలి బూడిదయ్యింది. ఒడిశాలోని బరంపురం వైపు అతివేగంగా వెళుతున్న కంటైనర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీన్ని గుర్తించిన డ్రైవర్, క్లీనర్ కంటైనర్‌ను నిలిపి..కిందకు దూకేశారు. అప్పటికే ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. గాయాలతో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లను స్థానికులు అంబులెన్స్‌లో బరంపురం మెడికల్‌కు తరలించారు. ఒడిశా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి రైతు చిత్తు!

(ఐదో పేజీ తరువాయి)

రంగప్రవేశం చేస్తున్నారు. క్వింటా రూ.5 వేలకు కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం క్వింటా పత్తిని రూ.8,110 మద్దతు ధరగా నిర్ణయించింది. కానీ రూ.3 వేల నష్టానికి అమ్ముకుంటున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి జిల్లాలోనే పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● కేంద్రాలకు తరలించాలి..

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలి. సీసీఐ నిబంధనల మేరకు 8 నుంచి 12 మధ్యలో తేమ ఉంటే మంచి మద్దతు ధర లభిస్తుంది. విధిగా ఈక్రాప్ రిజిస్ట్రేషన్ అయ్యి ఉండాలి. 8 వేల ఎకరాలు సాగు చేస్తేనే నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రం మంజూరు అవుతుంది.

-బి.రవికిరణ్ , ఏడీ(ఎఫ్ఏసీ), మార్కెటింగ్ శాఖ, శ్రీకాకుళం

అభివృద్ధే అజెండాగా పనిచేయండి

- జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ
- డిసెంబరు నుంచే ఉపాధి పనులు ప్రారంభం కావాలి
- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ

అరసవల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధే అజెండాగా అధికారులు పనిచేయాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ఆమదాలవలస శాసనసభ్యుడు కూన రవికుమార్ మాట్లాడుతూ... డిసెంబరు నెల నుంచి ఉపాధి పనులు ప్రారంభమయ్యేలా ఫీల్డ్ సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇవ్వాలని కోరారు. 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.9 లక్షల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. రహదారులపై విద్యుత్ శాఖ వేసిన స్తంభాలతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని కూన రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

గృహనిర్మాణ శాఖకు సంబంధించి మంజూరైన, నిర్మాణంలో ఉన్న గృహాల పురోగతిని ప్రాజెక్ట్ డైరెక్టర్ సమావేశంలో వివరించారు. పరిశ్రమల శాఖపై సహాయ సంచాలకుడు గురునాథ్ వివరాలు సమర్పించారు. పైడిభీమవరం, పలాస, పాత్రునివలసల్లో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు భవన నిర్మాణాలు జరుగుతున్నట్లు ఏడీ చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ లాగ్ బుక్‌లో సమస్యలు లేకుండా చూడాలని ఛైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ ఎస్ఈ సత్యనారాయణ వివిధ పనుల వివరాలు తెలియజేశారు. ఈ సమావేశాలలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో సత్యనారాయణ, జిల్లా అధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

2న ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి హుండీలను డిసెంబరు 2న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు అనివెట్టి మండపంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది సమక్షంలో హుండీల లెక్కింపు జరగనుందని తెలిపారు.

యూటీఎఫ్ నూతన కమిటీ

ఎచ్చెర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ శాఖ నూతన కమిటీ ఎన్నిక శనివారం తోటపాలెం రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా కె.సూర్యనారాయణ, అధ్యక్షుడిగా సీహెచ్.రామారావు, సహాధ్యక్షులుగా జి.అజయ్‌కుమార్, ఎస్.స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్, కోశాధికారిగా కె.వసంతకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా డి.చిన్నబాబును ఎన్నుకున్నారు.

భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం

ఇచ్ఛాపురం,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో 1985 జనవరి నుంచి 2025 ఆగస్టు 31 మధ్యలో అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవడానికి బీపీఎస్ పథకం ద్వారా భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు తరలిరండి

ఇచ్ఛాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఖమ్మంలో జనవరి 18న జరగనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు అంతా తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐని స్థాపించి వందేళ్లు పూర్తయిందని తెలిపారు. శతాబ్ది మహాసభ రాష్ట్ర రాజకీయాలకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త దిశానిర్దేశం ఇవ్వనుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంటకరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, ఆరేలమ్మ, సంతోష్, జిల్లా సమితి సభ్యులు వేణుగోపాల్ పాల్గొన్నారు

మహాసభలను జయప్రదం చేయాలి

ఆమదాలవలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభల్లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఉపాధ్యక్షుడు కె.నాగమణి కోరారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని పారి శ్రామిక వాడలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రకాశరావు, లతాదేవి, భూలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

లావేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం వద్ద జాతీయ రహదారిపై 20 మంది మహిళలతో వెళ్తున్న ఆటోను జేఆర్ పురం సీఐ ఎం.అవతారం అడ్డుకున్నారు. వీరంతా వరి కోతలు కోసేందుకు బుడతవలస నుంచి శ్రీకాకుళం వైపు ఆటోలో వెళ్తున్నట్లు గుర్తించారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.అప్పలనూరి తెలిపారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి నారాయణవలస సంతకు మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను కంచిలి వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. 11గేదెలు, 11 దూడలను పట్టుకుని గోశాలకు తరలించినట్లు చెప్పారు. వాహనాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటికి దూరంగా ఉండాలని ప్రముఖ న్యాయవాది, యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు అన్నారు. శనివారం రత్తకన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టం, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం

జి.సిగడాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎం.సరిత అన్నారు. శనివారం పెంట, నాగులవలస గ్రామాల్లో ధాన్యం రాసులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని తెలిపారు. త్వరితగతిన ట్రక్‌షీట్‌లు, షెడ్యూల్ ఇచ్చేలా చూడాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. ఏ ఒక్క రైతుకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వద్దని అన్నారు. కార్యక్రమంలో ఏవో బెందు బాబ్జీ, వీఏఏ తలచింతల కుసుమ, టెక్నికల్ అసిస్టెంట్ రామాచారి, డీఈవో మీసాల అశోక్, అలుగోలు సుధాకర్ పాల్గొన్నారు.

రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● విప్, ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శనివారం తేలుకుంచి గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో రైతులను రాజును చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం చేస్తున్న లబ్ధి, వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు తీసుకుంటున్న చర్యలను రైతులకు వివరించాలని అధికారులకు సూచించారు. అనంతరం రైతులకు రబీ విత్తనాలు పంపిణీ చేశారు. రబీ సీజన్‌లో నీటి వినియోగం, ఎరువుల సమర్థ వినియోగం, పంటల రక్షణ, యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి పద్మనాభం, దక్కత కామేష్, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, మేరుగు సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ మణిప్రకాష్, దూపాన సూర్యనారాయణ, ఏవో అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఇది రైతు ప్రభుత్వం

● విజయనగరం ఎంపీ కలిశెట్టి

రణస్థలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇది రైతుల ప్రభుత్వమని, వారి సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం కొండములగాంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న మేలును వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దన్నాన సత్తిబాబు, దన్నాన స్వామినాయుడు, కలిశెట్టి సూర్యనారాయణ, పిన్నింటి భానోజీనాయుడు, మండపాక కనకారావు, బాలి శ్రీను, సత్యం, సందీప్ పాల్గొన్నారు.


రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న కలిశెట్టి

ఆధునిక సాగుతోనే ఆర్థిక పరిపుష్టి: ఎమ్మెల్యే శిరీష

హరిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాగుతోనే రైతులు పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించి ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం కొండలోగాం గ్రామంలో శనివారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లుండ, నర్సింగపురం సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ రామారావు, డీటీ రామకృష్ణ, హెచ్‌వో శంకర్‌దాస్, పశువైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, బావన దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.


హరిపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

● వజ్రపుకొత్తూరు: రైతులకు మరింత ఆదాయం పెంచేందుకే రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం రాజాం గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించిన 9752485999 ఫోన్ నెంబరును పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాల్ల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కణితి సురేష్, మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబుచౌదరి, బుల్లోజు శశిభూషన్, జేజే రావు, సూరాడ మోహనరావు, చెల్లూరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు (సారవకోట), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశానికి ఆహారాన్ని అందించి ఆదుకుంటున్న రైతును రాజు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండలం గొర్రిబంద పంచాయతీ బురుజువాడలో శనివారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతుకు వ్యవసాయం లాభసాటి చేయడానికి ప్రభుత్వం అన్ని విధాలా శ్రమిస్తుందన్నారు. అనంతరం రైతులకు చిరుధాన్యాల మినీ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ఎంపీడీవో మోహనకుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, వ్యవసాయశాఖ ఏడీ ఎల్‌వీ మధు, ఏవో వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు చిరుధాన్యాల కిట్లు అందిస్తున్న దృశ్యం

పరిశ్రమల స్థాపనతోనే
నిరుద్యోగ సమస్య పరిష్కారం

● అభివృద్ధిని అడ్డుకుంటున్న వారు మూర్ఖులు ● ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగ సమస్య తీరాలన్నా పరిశ్రమల స్థాపనతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం యరగాం, ఒప్పడాం గ్రామాల్లో పలువురు టీడీపీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా యరగాంలో ఆయన మాటాడుతూ.. నియోజకవర్గంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దులో ఎటువంటి కాలుష్యం లేని సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం జెన్కో ఆధ్వర్యంలో నిర్మించనుందని తెలిపారు. కొంతమంది పనీపాట లేని వ్యక్తులు థర్మల్ ప్లాంట్‌పై విష ప్రచారం చేస్తూ ఈ ప్రాంత ప్రజలను భయపెట్టడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు అడ్డుకోవాలని చూస్తున్నారని, అటువంటి వ్యక్తులు చరిత్రలో మూర్ఖులుగా మిగిలిపోతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గురువు తిరుమలరావు, నాయకులు గోవిందరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

థర్మల్ పవర్‌ప్లాంట్
ప్రతిపాదనను రద్దు చేయాలి


థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

బూర్జ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దులో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలని పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అడ్డూరిపేట గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. థర్మల్ ప్లాంట్‌తో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడనుందని అన్నారు. అనంతరం పవర్‌ప్లాంట్ ప్రతిపాదిత ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్‌దొర, కార్యదర్శి సవర సింహాచలం, కోశాధికారి రవికాంత్, ఉపాధ్యక్షులు మిన్నారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

● మండల సమావేశంలో కోరిన సభ్యులు

లావేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధిక శాతం రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారని, పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అదపాక, గుమడాం ఎంపీటీసీలు గంట్యాడ సత్యం, జనపాల భానోజీరావు, గోవిందపురం సర్పంచ్ పిల్లా రాముతో పాటు పలువురు సభ్యులు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అదపాక-వెంకటాపురం, అదపాక- పొందూరు, బుడు మూరు-తామాడ, మురపాక- కుప్పిలి గెడ్డ వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని మండల ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, తామాడ ఎంపీటీసీ రౌతు నారాయణరావు, అదపాక ఎంపీటీసీ గంట్యాడ సత్యంతో పాటు పలువురు సభ్యులు ఆర్టీసీ అధికారులను కోరారు. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వరుసగా మూడు నెలల పాటు రేషన్ తీసుకోని వారి కార్డులను తొలగిస్తామని అన్నారు. రీసర్వే చేసిన గ్రామాల్లో ఎల్‌పీఎంలు పరిష్కారానికి రూ.50 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2026-27ఆర్థిక సంవత్సరానికి గాను రూ.49.55కోట్లు మండల అంచనా బడ్జెట్‌ను తయారు చేసినట్లు ఏపీవో ఆర్.సత్యవతి తెలిపారు. గత 16 నెలలుగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించలేదని, వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అదపాక ఎంపీటీసీ గంట్యాడ సత్యం, గుర్రాలపాలెం ఎంపీటీసీ జనపాల భానోజీరావు తదితరులు సభ దృష్టికి తెచ్చారు. జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, ఎంపీడీవో పి.వెంకటరాజు, డిప్యూటీ ఎంపీడీవో పద్మజ, ఏఈలు శ్రీవల్లి, కె.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశం జరుగుతున్న దృశ్యం

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

● ఏఐసీసీ కార్యదర్శి పాలక్ వర్మ


మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి పాలక్‌వర్మ

అరసవల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి పాలక్‌వర్మ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లా నుంచి 23 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. పార్టీలో కష్టించి పనిచేసేవారికి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని, సిఫారసులకు తావు లేదని స్పష్టం చేశారు. అందరూ పార్టీ ఆదేశాలు, నియమాలను అనుసరించి మాత్రమే పనిచేయాలని, వ్యక్తిగత అజెండాలకు తావు లేదని స్పష్టం చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ఛార్జి సూరత్ సింగ్ ఠాకూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శాంతకుమారి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఎచ్చెర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని శ్రీకాకుళం ఆహార భద్రతా ప్రమాణాల అధికారి జి.శ్రీరాములు అన్నారు. కేశవరావుపేట పంచాయతీ రాజీవ్‌నగర్ కిరాణా షాపులో ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కొన్ని శాంపిల్స్‌ను సేకరించి పరిశీలన నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

రహదారుల పనులకు శంకుస్థాపన

సోంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెంకిలి, జింకిభద్ర గ్రామాల్లో రూ.1.32కోట్లతో చేపట్టనున్న రోడ్ల పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణంలో గతి తప్పిందని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రహదారుల పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మడ్డు కుమార్, నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, జుత్తు పురుషోత్తం, మడ్డు బుద్ధేశు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు

● రైతుల గుండెల్లో గుబులు ● ధాన్యాన్ని కాపాడుకునేందుకు పాట్లు

జి.సిగడాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు రావడంతో రైతుల గుండెల్లో గుబులు రేగుతుంది. శనివారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు వేయడంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునే పనిలో పడ్డారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రాసులుగా పోసి టార్పాలిన్లు కప్పుతున్నారు. పొలాల్లో నూర్చిన వరి పంటను భద్రపరచుకునేందుకు అవస్థలు పడుతున్నారు.


పెంట గ్రామంలో ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుతున్న దృశ్యం

క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

కంచిలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జలంత్రకోట హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పెద్ద శ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. జూనియర్ కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికలు ప్రథమ, ద్వితీయ స్థానం, జూనియర్, సీనియర్ బ్యాడ్మింటన్‌లో బాలురు ప్రథమ స్థానం సాధించారు. సీనియర్ వాలీబాల్ పోటీల్లో బాలికలు, జూనియర్ వాలీబాల్‌లో బాలురు ద్వితీయ స్థానం పొందారు. వీరికి జలంత్రకోట హెచ్‌ఎం ఉమా మహా పాత్రో శనివారం బహుమతులు అందించారు. పీఈటీ సంతోష్‌గౌడ్‌ను సన్మానించారు.

డిస్కస్‌త్రోలో మొదటిస్థానం

సోంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో శుక్రవారం జరిగిన ఖేలో ఇండియా అండర్-16 డిస్కస్‌త్రో పోటీల్లో జిల్లాస్థాయిలో సోంపేట జూనియర్ కళాశాలకు చెందిన శాసనపురి శైలజ ప్రథమస్థానంలో నిలిచింది. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహన్‌రావు, అధ్యాపకులు పి.రజనీకుమారి, ఎ.రామినాయుడు, ఎం.ప్రసాద్, సంధ్యారాణి, ప్రవీణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

పోలీసు సిబ్బందికి కళ్లద్దాల పంపిణీ


కానిస్టేబుల్‌కు కళ్లద్దాలను అందిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంప్యూటర్ పనిచేసే కానిస్టేబుళ్లు, ఐటీకోర్ సిబ్బంది, డీసీఆర్‌బీ సిబ్బంది, పోలీస్ కార్యాలయ సిబ్బంది మొత్తం 100 మందికిపైగా యాంటీ గ్లేర్ కళ్లద్దాలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో కంప్యూటర్లు, సీసీటీవీ మానిటర్లు, టెక్నికల్ పరికరాలు, డేటా ఎంట్రీ పనులు, కార్యాలయ ఉత్తరప్రత్యుత్తరాలు, స్క్రీన్‌లను ఎక్కువ సేపు ఉపయోగించే సిబ్బందిలో కంటి ఒత్తిడి, నీరసం, తలనొప్పి, దృష్టి మందగింపు వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఎస్పీ అన్నారు. ఈ నేపథ్యంలో కంటి సమస్యలు తగ్గించడంలో సహాయపడే యాంటీ గ్లేర్ అద్దాలను సిబ్బందికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, సీహెచ్ ఏవో గోపీనాథ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడివలస హెచ్‌ఎంపై విచారణ


విచారణ జరుపుతున్న అధికారులు

పొందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బల్ల కంఠయ్యపై శనివారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయ కుమారి, పొందూరు, ఎంఈవో-1 వాగ్దేవి విచారణ చేపట్టారు. పాఠశాల నిధులను హెచ్‌ఎం కంఠయ్య దుర్వినియోగం చేశారని గ్రామానికి పైడి విజయ్‌కుమార్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫిర్యాదుదారుడి సమక్షంలో అధికారులు హెచ్‌ఎంను విచారించారు. నిధుల వినియోగంపై ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు కనీసం సమాచారం లేదని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తామని డిప్యూటీ డీఈవో విజయకుమారి తెలిపారు.

సందడిగా ఫుడ్ ఫెస్టివల్

కంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాడుపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం సందడిగా జరిగింది. బాలిక లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వివిధ రుచికరమైన వంటకాలు, ఫ్రూట్ సలాడ్‌లను తయారు చేసి ప్రదర్శించారు. పాఠశాల విద్యాకమిటీ సభ్యు లతో పాటు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆ పదార్థాలను రుచి చూశారు. విద్యార్థులు చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించి ముందజలో ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాణికుమారి తెలిపారు.


ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థినులు

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

పొందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమం ఆకట్టుకుంది. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాలు వ్యవహరించే తీరును కళ్లకు కట్టినట్లు చూపారు. ముఖ్యమంత్రిగా విద్యార్థిని కె.అనూష వ్యవహరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, శాంతిభద్రతలు, పరిశ్రమలపై ప్రతిపక్షస్థానంలో ఉన్న విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అనూష సమాధానాలు ఇవ్వడం ఆకట్టుకుంది. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ మధుసూదనరావు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో రొటేరియన్ ఎస్.వసంతరావు, అధ్యాపకులు వాసుదేవరావు, సూర్యారావు, అప్పారావు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు..

కేంద్రమంత్రిని కలిసిన బోయిన

అరసవల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కళింగ కోమటి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన బోయిన గోవిందరాజులు, 15 మంది డైరెక్టర్లు శనివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఆయన నివాసంలో కలిశారు. గోవిందరాజులును మంత్రి సత్కరించారు. అనంతరం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

లావేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ఎంఈవోలు గట్టు శ్రీరాములు, మజ్జి మురళీకృష్ణ అన్నారు. శనివారం మెట్టవలస జడ్పీ స్కూల్ ఆవరణలో మండల స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ చూపాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు వి.సత్యనారాయణ, సర్పంచ్ రౌతు సురేంద్ర, క్రీడోపాధ్యాయురాలు చదువుల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస రైల్వేస్టేషన్ (శ్రీకాకుళం రోడ్డు) వద్ద ఊసవానిపేట గేటు సిగ్నల్ పాయింట్ సమీపంలో శనివారం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు తెలిపారు. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉంటుందని, కుడిచేతిపై పువ్వు గుర్తు గల పచ్చబొట్టు ఉందని, నీలం, తెలుపు, నలుపు రంగుచారలు ఉన్న టీషర్ట్‌తో పాటు తెలుపు, నీలం రంగు ఉన్న గళ్లలుంగీ ధరించి ఉన్నాడని వివరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించామన్నారు. వివరాలకు 9493474582, 9110305494 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వేంపాడు వద్ద పలాస వాసి..


షేక్ తాజుద్దీన్(ఫైల్)

నక్కపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు హైవే వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ఒక వ్యక్తి మృతిచెందాడు. నక్కపల్లి ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన షేక్ తాజుద్దీన్(36) ఇటీవల రాజమహేంద్రవరంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం రాత్రి అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై పలాసకు బయలుదేరాడు. దారిలో వేంపాడు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పలాసలో ఉన్న తాజుద్దీన్ కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి కుప్పలు దగ్ధం


దగ్ధమవుతున్న వరికుప్పలు

సంతబొమ్మాళి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మలగాం గ్రామంలో శనివారం రాత్రి వరి కుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బొమ్మాళి కృష్ణారావు తన రెండెకరాల వరి పంటను కోసి పంట పొలంలోనే కుప్పలు పెట్టారు. అయితే శనివారం రాత్రి వరి పంట కుప్పలకు అగ్గి తగిలి దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆదుపు చేశారు.

ఉజ్జుడిమెట్టను పరిశీలించిన అధికారులు


కంకర తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలాసరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో గల ఉజ్జుడుమెట్టలో ఇటీవల కంకరను రాత్రివేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల 'ఉజ్జుడిమెట్ట పాయే' శీర్షికతో ప్రచురితమైన కథనంపై మైనింగ్ అధికారులు స్పందించి శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎంతమేర కంకర తవ్వారు, ఉజ్జుడుమెట్ట ప్రాంతం చుట్టూ ఉన్న భూముల వివరాలు, వెనక నుంచి కంకరను తవ్వుకుంటూ తరలించారనే విషయంపై పరిశీలించారు. వీటిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఇటీవల పలాస మండలంలో రాజగోపాలపురం, కేదారిపురం, కంబిరిగాం ప్రాంతాల్లో కూడా రాత్రిపూట అక్రమంగా కంకర డంపింగ్ చేయడం, కొన్ని చోట్ల అక్రమంగా తరలించడంపై రెవెన్యూ అధికారులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో అసిస్టెంట్ జియాలజిస్టు రాము, టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్ర, వీఆర్‌వో నౌషాద్ ఉన్నారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


వేతనదారులను విచారిస్తున్న అధికారులు

పాతపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బూరగాం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ కుమారి పొల్లాయ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు శనివారం విచారణ చేపట్టారు. కుమారి పొల్లాయ్ తప్పుడు మస్తర్లు వేస్తూ వేతనదారులకు అన్యాయం చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై సచివాలయంలో బహిరంగ విచారణ చేపట్టారు. డ్వామా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీ పి.రాధ, ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి, ఏపీవో అంగూరు సురేష్ తదితరులు పోలీసుల పర్యవేక్షణలో వేతనదారులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు


పోలీసులు, అధికారుల పర్యవేక్షణలో ఆక్రమణల తొలగిస్తున్న దృశ్యం

పోలాకి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వనితమండలం పంచాయతీ జొన్నాం గ్రామంలో రహదారి ఆక్రమణలు తొలగింపు శనివారం చేపట్టారు. ఈ క్రమంలో గ్రామంలోని ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సచివాలయ సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ ఎస్.రంజిత్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. అనంతరం జేసీబీతో ఆక్రమణలు తొలగించే పనులు చేపట్టారు.

రాష్ట్రస్థాయి గట్కా పోటీలకు అభిషేక్


పడాల అభిషేక్

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ క్రీడా వికాస్ కేంద్రం నుంచి పడాల అభిషేక్ గట్కా (పంజాబ్ యుద్ధక్రీడ) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించనున్న పోటీల్లో అభిషేక్ పాల్గొనున్నట్టు తెలిపారు. అభిషేక్, కోచ్ శేఖర్‌లను డీఎస్‌డీవో మహేశ్వరరావు అభినందించారు.

రేపు గీతా సహస్రగళార్చన

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండ్రవీధిలో గల విశ్వహిందూ పరిషత్, గీతామందిరం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8గంటల నుంచి గీతా సహస్రగళార్చన నిర్వహించనున్నట్టు సత్సంగ కమిటీ సభ్యులు జామి వేంకటేశ్వరరావు, కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామూహికంగా ఒక వేదికపై చేపట్టనున్నట్టు తెలిపారు. భగవద్గీతలోని 18 అధ్యాయాల పారాయణం చేపట్టనున్నట్టు తెలిపారు.

క్లోరినేషన్‌కు నోచుకోని ట్యాంకులు

- శిథిలావస్థలో మెట్లు
- మామిడిపల్లి, సరియాపల్లి గ్రామాల్లో తాగునీటి అవస్థలు
- పట్టించుకోని యంత్రాంగం


మెట్ల రైలింగ్ ఊడి, శుభ్రతకు నోచుకోని సరియాపల్లిలోని ట్యాంకు


మామిడిపల్లిలోని తాగునీటి ట్యాంకు

పలాస రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పలాస మండలం మామిడిపల్లి, సరియాపల్లి గ్రామాల్లో తాగునీరు అందించే ట్యాంకులు శుభ్రత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మెట్లు శిథిలావస్థకు చేరుకోవడం స్వచ్ఛమైన నీరు తాగేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మామిడిపల్లి గ్రామంలో గతేడాది నుంచి ట్యాంకు క్లోరినేషన్ చేపట్టలేదని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గత రెండు మండల సమావేశాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఎంపీటీసీ ఎం.పాపారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సంబంధిత అధికారులు ట్యాంకును పరిశీలించిన దాఖలాలు లేవని మండిపడుతున్నారు. ట్యాంకుపైకి ఎక్కేందుకు మెట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎవరూ సాహసించడం లేదన్నారు. అదే విధంగా సరియాపల్లి గ్రామంలో కూడా ఇదే దుస్థితి నెలకొంది. ట్యాంకును శుభ్రం చేయకపోవంతో గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామంలోని వాటర్ ట్యాంకును క్లోరినేషన్ చేయించి, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ ధనుంజయను వివరణ కోరగా.. ట్యాంకు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, ఆమోదం వచ్చిన వెంటనే పనులు చేస్తామని తెలిపారు. ట్యాంకు పరిశుభ్రపరిచే బాధ్యత పంచాయతీ అధికారులదేనని స్పష్టం చేశారు.

టెక్కలి డివిజన్‌లో చేర్చడంపై హర్షం


సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రుల చిత్ర పటాలకు పాలభిషేకం చేస్తున్న దృశ్యం

నందిగాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజల ఇబ్బందుల్ని గుర్తించేది మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడేనని టీడీపీ మండల అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ అన్నారు. నందిగాం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌లోకి మార్పు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడి చిత్ర పటాలకు పాలభిషేకం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నందిగాం మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన పలాస రెవెన్యూ డివిజన్‌లో చేర్చి మండల ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసిందన్నారు. దీంతో ఎన్నికల సమయంలో మండల ప్రజలు తమ సమస్యను అచ్చెన్నాయుడికి వివరించడంతో ఇప్పుడు ఆ సమస్య పరిష్కారం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. తెంబూరు పీఏసీఎస్ అధ్యక్షుడు పోలాకి చంద్రశేఖర్, వంశధార డీసీ ఛైర్మన్ ఎం.బాలకృష్ణ, గొర్రెల పెంపకందారుల సహకార సంఘ ఛైర్మన్ కె.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

నందిగాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు సభ్యులు కోరారు. శనివారం నందిగాం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ వివిధ శాఖల ప్రగతిపై చర్చించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ పి.చంద్రశేఖర్, ఏవో పి.శ్రీకాంత్ వర్మ, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, వైస్ఎంపీపీ ఆర్.లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ 2025-26 సవరణ బడ్జెట్, 2026-27 సంవత్సర అంచనా బడ్జెట్లను సభ్యులు ఆమోదించింది.

రహదారిపై వాహనాలు నిలిపితే చర్యలు

కోటబొమ్మాళి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ వి.సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం కొత్తపేట సమీపంలో సర్వీసు రోడ్డుపై లారీలు, తదితర వాహనాలు ఆపకుండా శనివారం తన సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు. కొత్తపేట కూడలి, ఎత్తురాళ్లపాడు, పొడుగుపాడు, చీపుర్లపాడు, గట్లపాడు, పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి ప్రాంతాల్లో ఎవరైనా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపితే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే రూ.1000 అపరాధ రుసుం విధిస్తామన్నారు.

వాహనాల తనిఖీ


పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్ఎన్ పేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల తనిఖీలు చచేసి బకాయిలు రికవరీ చేస్తున్నట్టు సరుబుజ్జిలి పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. ఈ క్రమంలో బకాయిలు తప్పని సరిగా చెల్లించుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మందస మండల సమావేశం

మందస, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు మినీ గోకులాల మంజూరులో రాజకీయమెందుకని పలువురు ఎంపీటీసీ సభ్యులు పశువైద్యాధికారిని ప్రశ్నించారు. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించి కొనుగోలు సవ్యంగా జరిగేలా చూడాలని ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. పీహెచ్‌సీలో ఏఎన్ఎంల కొరత ఉందని సభ్యులు అన్నారు. 2025-26 సంవత్సరానికి సవరణ బడ్జెట్, 2026-27 సంవత్సరంలో అంచనా బడ్జెట్ ప్రతిపాదించారు. ఎంపీడీవో వై.వెంకటరమణ, వైస్ఎంపీపీ సీర ప్రసాద్, డీటీ కె.రామకృష్ణ, వివిధ అధికారులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో ప్రయోజనం

పాతపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సులతో స్వయం ప్రతిపత్తి సాధ్యమవుతుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వృత్తి విద్యాకోర్సుల విభాగం విద్యార్థులకు ఓటీపీ(ఆన్‌జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం)ను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవిరాజ్, సీసీలు ధర్మారావు, ఎల్‌సి చిట్టిబాబు సాహు, సీవో కిశోర్, ఎంఎస్ ధనలక్ష్మి, పాలవేణి త్రిసభ్య కమిటీ జిల్లాసభ్యుడు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

సంతబొమ్మాళి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని భావనపాడు మెరైన్ సిఐ డి.రాము అన్నారు.శనివారం మండలంలోని ఎం.సున్నాపల్లి గ్రామంలో మత్స్యకారులకు అవగహన కల్పించారు.తుఫాన్ సమయంలో మత్స్యకారులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.బీచ్‌ల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తీరగ్రామాల ప్రజలు పర్యవేక్షణ ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.ఐ.చిట్టిబాబు,సిబ్బంది వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

జలుమూరు (సారవకోట), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోటలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యవంతులైన యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను ప్యూరిఫికేషన్ చేయాలి

నరసన్నపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం మేరకు బీఎల్‌వోలు ఓటర్లు జాబితాలను ప్యూరిఫికేషన్ చేయాని నియోజవర్గ రిటర్నింగ్ అధికారి జయదేవి సూచించారు. శనివారం నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. 2002 ఓటర్లు జాబితాలతో ప్రస్తుత ఓటర్లు జాబితాలను పరిశీలించి వడపోతను చేపట్టాలన్నారు. సమావేశాలకు హాజరుకాని బీఎల్‌వోలకు నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రామారావు, డీటీ శ్రీనివాసరావు, ఎన్నికల డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగా చేరిన విద్యార్థులను సాధారంగ ఆహ్వానిస్తూ కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. విద్యార్థులు, అధ్యాపకులు, సీనియర్లు సందడి చేయడంతో కార్యక్రమం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, ట్రెజరర్ నాగరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేస్తాం

కాశీబుగ్గ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ 12వ వార్డులోని శ్మశానవాటికను ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో అభివృద్ధి చేస్తామని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. శనివారం కాశీబుగ్గ పల్లివీధిని ఆనుకొని ఉన్న శ్మశానవాటికను మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతోపాటు 11, 12, 13వ వార్డుల టీడీపీ ఇన్‌చార్జీలతో కలిసి ఆయన పరిశీలించారు. కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ నాయకులు చంద్రశేఖర్ త్యాడి, నాగరాజు, కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

ఆమదాలవలస, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 12వ పీఆర్‌సీని వెంటనే నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బొడ్డేపల్లి మోహన్‌రావు, డి.లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, కె.షణ్ముఖరావు, బీవీ రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

జి.సిగడాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీపీఎంవో రవీంద్ర అన్నారు. శనివారం పెంట, మెట్టవలస విలేజ్‌హెల్త్ క్లీనిక్‌లను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. జి.సిగడాం పీహెచ్‌సీ వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు, ఎంఎల్‌హెచ్‌పీ సుభాషిని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు

మెళియాపుట్టి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేయనున్నట్టు టీడీపీ రాష్ట్రకార్యనిర్వహన కార్యదర్శి బైరిసింగి దికర్‌రావు తెలిపారు. శనివారం అడ్డివాడ గ్రామంలో ఇళ్లులేని కుటుంబాల సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం జగన్న ఇళ్ల పేరుతో నిధులు ఖర్చు చేసినా గిరిజనులు మంజూరు చేయలేదన్నారు.

'అక్షరాంధ్ర'ను విజయవంతం చేయండి


వలంటీర్లకు సామగ్రి అందిస్తున్న దృశ్యం

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మొజ్జాడ రేణుక పిలుపునిచ్చారు. శనివారం వయోజనవిద్య శాఖ ద్వారా వలంటీర్ ఉపాధ్యాయులకు పెన్సిళ్లు, ఎరైజర్లు, షార్ప్‌నర్లు వంటివి అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి అధికారులు, వలంటీర్లు కృషి చేయాలని కోరారు. ఈమెతో పాటు బగాది ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌గా గోవిందరాజులు


గోవిందరాజులు

కోటబొమ్మాళి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌గా కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయుడు బోయిన గోవిందరాజులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లపాటు ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు హయాం నుంచి ఆయన టీడీపీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర కళింగ కోమట్ల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహనాయుడు, అచ్చెన్నాయుడులకు గోవిందరాజులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పలాసరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పెదంచల, వీరరామచంద్రాపురం గ్రామానికి చెందిన యువతులు అయ్యప్ప దర్శనం కోసం శబరిమలకు వెళ్లి తిరిగి వస్తుండగా రామేశ్వరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించారు. అదే విధంగా ఆ ప్రమాదంలోనే గాయపడిన బాధితుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నందొరల అవినీతిపై తక్షణమే విచారణ చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో సమావేశం అయ్యారు. ఏపీవోపై 14 ఆరోపణలు, డీడీపై తొమ్మిది ఆరోపణలు ఉన్నాయని, అయితే విచారణ అధికారి మణికుమార్ వీరిద్దరికి దోస్తులు కావడం వల్ల వారిని రక్షించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. మణికుమార్‌ను తొలగించి నిజాయతీ కలిగిన అధికారిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.దానేష్, కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, దేశభక్త ప్రజాతంత్ర జిల్లా అధ్యక్షుడు వీరస్వామి డిమాండ్ చేశారు.

నేడు మోడల్ పరీక్ష

హరిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మందస మండలం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, కిశోర్‌కుమార్ పాత్రో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు హరిపురం హైస్కూల్‌లో నిర్వహించనున్న పరీక్షకు ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని కోరారు.

ప్రాంగణ నియామకాల్లో 27మంది ఎంపిక

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ కేంద్రం ద్వారా శనివారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 27మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలి పారు. టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో టైర్స్, డెక్కన్ కెమి కల్స్, స్విగ్గీ, జొమోటో కంపెనీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, కసవయ్య ఉన్నారు.

క్యూబిటెక్ సంస్థతో ఎంవోయూ

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో నూతన మార్గాలను సృష్టిస్తున్న ఐతమ్ కళాశాల మరో కీలక అడుగు ముందుకు వేసింది. శనివారం హైదరాబాద్‌కు చెందిన క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ సంస్థతో అవగాహన కుదుర్చుకున్నట్టు డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఒప్పందంలో క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ సహవ్యవస్థాపకుడు పృథ్వీ పిన్నాకతో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, డీన్ రాజేష్ ఉన్నారు.

క్రికెట్ జట్టుకు ఎంపికలు


పోలాకి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజారాంపురం క్రీడా మైదానం శనివారం మండలస్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు ఎంపిక మండల స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ ఎం.నీలం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ ఎంపికల్లో 48 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈవో-2 ఎస్.శ్రీనివాసరెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మండలస్థాయిలో జరిగిన ఎంపికల్లో 16 మంది ఉపాధ్యాయులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

గ్రిగ్స్ పోటీలు

జలుమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో రెండు రోజులుగా కరవంజ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన గ్రిగ్స్ పోటీలు శనివారంతో ముగిసాయి. శ్రీముఖలింగం ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖో జూనియర్ బాలురు విభాగంలో ప్రథమ స్థానం, కబడ్డీలో ప్రథమ స్థానం, వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, సీనియర్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు.

- పలాస: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతి చూపిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో బి.సత్యం కోచ్ పి.తవిటయ్య తెలిపారు. న్యాయనిర్ణేతలుగా పీఈటీలు సీహెచ్ పద్మలోచన, ఎస్.చంద్రశేఖర్, రామ్‌జీ, శంకరరావు, శ్రీనివాస్ తదితరులు వ్యవహరించారు.

ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ


హిరమండలం: ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

పాతపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటంతోనే హక్కుల పరిరక్షణ సాధ్యపడుతుందని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన తాలూకా యూనిట్ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు ఆయన తెలిపారు. పాతపట్నం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా లుకలాపు రామారావు, పెద్దకోట బాలరాజు, కోశాధికారిగా శ్రీహరి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.ప్రేమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా డిశంకర నారాయణ, ఎస్వీ జగన్మోహనరావు, లోకేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా బి.వెంకటరమణ, డి.శరత్‌కుమార్, డి.హేమసుందర్, మహిళా జాయింట్ సెక్రటరీగా పి.వనజాక్షి ఎన్నికైనట్టు తెలిపారు. ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రర్ పూజారి జానకిరామ్, ఐసీడీఎస్ రాధాకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు కె.జయరావు, ఇరిగేషన్ శాఖ నుంచి రాజ్‌కుమార్, తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, సబ్‌ట్రెజరీ అధికారి పి.మన్మథరావు, డీటీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

- హిరమండలం: ఏపీఎన్జీవో హిరమండలం తాలుక యూనిట్ ఎన్నికలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగి టి.శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడిగా గణపతిరావు, జనరల్ సెక్రటరీగా బి.సునన్న, ఉపాధ్యక్షులుగా టి.సత్యనారాయణ, బి.జనార్దనరావు, పి.మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో గోవిందపట్నాయక్ ఎన్నికలు నిర్వహించారు.
- కొత్తూరు: ఏపీఎన్జీవో కొత్తూరు తాలుక యూనిట్ ఎన్నికలు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా అల్లు తిరుపతిరావు, అసోసియేషన్ అధ్యక్షుడిగా మహేంద్రకుమార్, జనరల్ సెక్రటరీగా ఇప్పిలి జానికిరామయ్య, ఉపాధ్యక్షులుగా నవీన్, జగన్నాథం, చంటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్ల శ్రీనివాసరావు అధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.